క్లుప్తంగా

పరవాడ డీఎస్పీ బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డీఎస్పీ సత్యనారాయణ

పరవాడ: పరవాడ డీఎస్పీగా కె.వి.సత్యనారాయణ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు డీఎస్పీగా విధులు నిర్వహించిన శ్రీనివాసరావు బదిలీపై వెళ్లారు. నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన సత్యనారాయణను పరవాడ సీఐ పెదిరెడ్ల ఈశ్వరరావు, ఎస్‌ఐలు సురేష్, మల్లేశ్వరరావు, తేజేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. పరవాడ పారిశ్రామికవాడలో ప్రజలు, ప్రజా ప్రతినిధులు, పోలీసుల సహాయ సహకారంతో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని డీఎస్పీ సత్యనారాయణ చెప్పారు.

ఇంటర్ తప్పిన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు

పరవాడ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ ఫెయిల్ అయిన విద్యార్థులకు సప్లిమెంటరీ పరీక్షల్లో పాల్గొనేందుకు మే 1 నుంచి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ లలితకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి క్లాసులు ప్రారంభమవుతాయని చెప్పారు. పరీక్షల్లో తప్పిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకోవాలని ప్రిన్సిపాల్ లలితకుమారి కోరారు.

సబ్బవరం: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్ పరీక్షల్లో ఫెయిలైన విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ మురళీధర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిరోజు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఈ తరగతులు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. తరగతులు మే 1వ తేదీ నుంచి పరీక్షలు పూర్తయ్యేంతవరకూ నిర్వహిస్తామని పేర్కొన్నారు.

16 మందికి ఉద్యోగాలు



సర్టిఫికెట్లతో విద్యార్థులు

సింహాచలం: పెందుర్తి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలోని స్కిల్ హబ్ మొదటి బ్యాచ్ వీడ్కోలు సభ శనివారం ఘనంగా జరిగింది. నాలుగు నెలలపాటు పాలిటెక్నిక్‌లో ఇండస్ట్రియల్ కోర్సులో శిక్షణ పొందిన 28 మందికి ఏపీఎస్ఎస్‌డీసీ నుంచి ధ్రువీకరణ పత్రాలను ఆటోనగర్‌లోని ఎలక్ట్రికల్ ఆటోమేషన్ ఎండీ రమ్యశ్రీ , డైరెక్టర్ రమాకాంత్ అందజేశారు.శిక్షణ తీసుకున్న 28 మందిలో 16 మంది విశాఖపట్నంలోని పలు పరిశ్రమల్లో ప్లేస్‌మెంట్ పొందినట్టు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ చంద్రశేఖర్, కెవీఎస్.సుబ్రహ్మణ్యేశ్వరరావు, కోఆర్డినేటర్ బి.సౌజన్య పాల్గొన్నారు.

ఆవు వెనుకభాగంలో కణితి తొలగింపు



ఆవుకు శస్త్ర చికిత్స చేస్తున్న డాక్టర్ గణేష్

సింహాచలం: శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఒక ఆవుకి శస్త్రచికిత్స చేసి రెండు కిలోల కణితిని తొలగించారు. గోశాలలో ఉన్న ఓ ఆవుకు వెనుక భాగంలో రెండు కిలోల కణితి ఏర్పడింది. దీంతో ఆ ఆవు ఇబ్బంది పడేది. పశు వైద్యాధికారి డాక్టర్ ఎల్.గణేష్ శనివారం శస్త్రచికిత్స చేసి కణితి తొలగించారు. దీంతో ఆవు ఉపశమనం పొందింది.

తొమ్మిదిమంది పేకాటరాయళ్ల అరెస్టు

సింహాచలం:పెందుర్తి దరి గుర్రంపాలెం పీఎస్ఎల్ కంపెనీ సమీపంలోని ఒక గెస్ట్ హౌస్‌లో పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని టాస్క్ ఫోర్స్ పోలీసులు దాడి చేసి శనివారం పట్టుకున్నారు. వారి నుంచి 10 సెల్‌ఫోన్‌లు, రూ.1.25 లక్షల నగదు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. పెందుర్తి పోలీసులకు అప్పగించారు. ఈమేరకు కేసు నమోదు చేశారు.

సింహగిరి.. ఆధ్యాత్మిక ఝరి



క్యూలో వేచి ఉన్న భక్తులు



సింహాచలం: సింహగిరికి శనివారం భక్తులు పోటెత్తారు. కొండ దిగువ నుంచి గిరిపై వరకు ఎక్కడ చూసినా భక్తుల రద్దీ కనిపించింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని దర్శించుకున్నారు. దర్శనం క్యూలు కిక్కిరిశాయి. ప్రసాద విక్రయశాల, కేశఖండనశాల, అన్నదాన భవనం, ఆర్టీసీ బస్సులు, దేవస్థానం బస్సులు రద్దీగా మారాయి. దేవస్థానం ఉద్యోగులు డిప్యుటేషన్‌పై సింహగిరిపై విధులు నిర్వర్తించారు.

విశేషంగా అప్పన్న నిత్యకల్యాణం : శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి శనివారం నిత్యకల్యాణం విశేషంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలో ఉదయం 9.30గంటల నుంచి కల్యాణం అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించా రు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.



అప్పన్న ఉత్సవమూర్తులు

పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన



మైత్రీనగర్‌లో పార్క్ అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్

సింహాచలం: జీవీఎంసీ 98వ వార్డు మైత్రీనగర్‌లో పార్కు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్ రాజ్ శనివారం శంకుస్థాపన చేశారు. పార్క్‌లో రూ.19.50 లక్షల జీవీఎంసీ నిధులతో ఏర్పాటు చేయనున్న వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్, పిల్లల ఆటవస్తువుల ఏర్పాటుకు సంబంధించి పనులకు శ్రీకారం చుట్టారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ 45 రోజు ల్లో పనులు పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో మైత్రీనగర్ అధ్యక్షుడు సీహెచ్‌వీఎల్ నరసింహం, ట్రెజరర్ రామకృష్ణ, వైఎస్సార్‌సీపీ పెందుర్తి మండల అధ్యక్షుడు నక్క కనకరాజు, 98వవార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు ఎర్ర వరహానరసింహం, పీతల విష్ణుమూర్తి, కె.సింహాద్రి, ఎస్.అప్పారావు, జగదీష్, 93వవార్డు నాయకుడు దాసరి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

విద్యకు ప్రభుత్వం పెద్దపీట



తల్లిదండ్రులకు ప్రగతి పత్రాలు అందజేస్తున్న ఎంఈవో అప్పలరాజు

సబ్బవరం: రాష్ట్ర ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేస్తుందని ఎంఈవో ఎస్.అప్పలరాజు అన్నారు. సబ్బవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం సీహెచ్ చిన్నమ్మాయి అధ్యక్షతన శనివారం పేరెంట్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో అప్పలరాజు మాట్లాడుతదూ విద్యార్థుల తల్లిదండ్రులు కనీసం నెలకు ఒకసారి పాఠశాలను సందర్శించి తరగతి ఉపాధ్యాయులను తమ పిల్లల ప్రగతిని అడిగి తెలుసుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు కల్పిస్తుందన్నారు. జగనన్న విద్యా కానుక, జగనన్న గోరుముద్ద, అమ్మ ఒడి,8వ తరగతి విద్యార్థులకు బైజూస్ ట్యాబ్స్ పంపిణీ వంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థులకు గుణాత్మకమైన విద్య అందించడానికి కృషి చేస్తుందని తెలిపారు. విద్యార్థులకు ర్యాంకులు ముఖ్యం కాదని వారిలో సత్ప్రవర్తన ముఖ్యమన్నారు. తల్లిదండ్రులు నిత్యం తమ పిల్లలను గమనిస్తుండాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వారి తరగతి ఉపాధ్యాయులు ప్రగతి పత్రాలు అందజేశారు.

ఫైన్ ఆర్ట్స్‌లో గురుకుల విద్యార్థులకు పతకాలు



ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న సమన్వయ అధికారి రూపావతి తదితరులు

సబ్బవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ ఫైన్ ఆర్ట్స్ అకాడమీ నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. నేషనల్ బాలల చిత్రకళ అవార్డుతో పాటు ఏడు బంగారు పతకాలు, ఏడు వెండి పతకాలు సాధించారు.ఈ సందర్భంగా పాఠశాలలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా గురుకుల పాఠశాలల సమన్వయ అధికారి ఎస్. రూపావతి,పాఠశాల ప్రిన్సిపాల్ కె. విజయకుమార్‌తో కలిసి ఘనత సాధించిన విద్యార్థులను అభినందించారు. వీరికి శిక్షణ అందించిన ఆర్ట్ టీచర్ జి. అర్జునరావును సత్కరించారు. కార్యక్రమంలో గురుకుల పాఠశాల బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది లింగంపల్లి మృతి



శ్రీనివాసరావు(ఫైల్)

అల్లిపురం: సీనియర్ న్యాయవాది లింగంపల్లి శ్రీనివాససత్యనారాయణ శనివారం మధ్యాహ్నం మృతి చెందారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల పూర్వవిద్యార్థి అయిన ఆయన గత 29 సంవత్సరాలుగా న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఎన్‌బీఎం న్యాయకళాశాల విద్యార్థి నాయకుడిగా, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షునిగా సేవలందించారు. ఆయన ఆకస్మిక మృతి పట్ల జిల్లా ప్రధాన న్యాయమూర్తి గుత్తాల గోపి సంతాపం వ్యక్తం చేశారు. విశాఖ న్యాయవాదుల సంఘం, రాష్ట్ర బార్ కౌన్సిల్ ఉపాధ్యక్షుడు కె.రామజోగేశ్వరరావు, కౌన్సిల్ సభ్యులు పి.నరసింగరావు, ఎస్.కృష్ణమోహన్, బైపా అరుణ్‌కుమార్, గీతం కళాశాల అధ్యాపకులు ఆచార్య రాఘవయ్య, ఆచార్య అనితారావు, ఎన్‌బీఎం న్యాయకళాశాల అధ్యాపకులు డీవీ రమణ, విశాఖ న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, గాజువాక న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కేవీ స్వామి సంతాపం తెలిపారు.

భవన పటిష్టత పరీక్షలపై అవగాహన



ఆచార్య రామశేషును సత్కరిస్తున్న సత్యనారాయణ రెడ్డి

ఏయూక్యాంపస్: కాంక్రీట్ భవనాల పటిష్టతను గుర్తించే వివిధ పరీక్షలపై నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-వరంగల్ సివిల్ ఇంజినీరింగ్ విభాగం ఆచార్యులు రామశేషు విద్యార్థులకు అవగాహన కల్పించారు. శనివారం విభాగంలో కాంక్రీట్ స్ట్రక్చర్-నాన్ డిస్ట్రక్టివ్ టెస్టింగ్ అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా రీబౌండ్‌హామర్, అల్ట్రాపల్స్ వెలాసిటీ, అల్ట్రాసోనిక్‌థర్మోగ్రఫీ, విండ్సర్ ప్రోబ్, ఇన్‌ఫ్రా రెడ్ థర్మోగ్రఫీ, కవర్‌మీటర్, కాంక్రీట్‌ఇమేజింగ్, గ్రౌండ్ పెనెట్రేటింగ్‌రాడార్, రేడియోగ్రఫీ, ఎన్‌డీటీ ఇంపాక్ట్ ఎకో, లోడ్‌టెస్టింగ్ తదితర పద్ధతులను విద్యార్థులకు వివరించారు. కాంక్రీట్ భవనాల నిర్మాణ మూలకాల నాణ్యత, పటిష్టత, సమగ్రత, పగుళ్లు, లోపాలను గుర్తించడం వాటి పరిస్థితిని అంచనా వేసే విధానాలు తెలియజేశారు. చమురు నిల్వ ట్యాంకులు, డెక్ స్లాబ్‌వంతెను, బహుళ అంతస్థుల భవనాల నిర్మాణాలు, అగ్ని ప్రమాద ప్రభావిత నిర్మాణాలను ఉదాహరణలతో వివరించారు. విభాగాధిపతి ఆచార్య సీఎస్‌వీ సత్యనారాయణ రెడ్డి, ఆచార్య డి.ఎస్.ఆర్ మూర్తి, ఆచార్య జీవీ రామారావు, ఆచార్య రాజశేఖర్, డాక్టర్ శివపార్వతి తదితరులు పాల్గొన్నారు. పెద్దసంఖ్యలో విభాగ విద్యార్థులు, పరిశోధకులు హాజరయ్యారు.

ఘనంగా వైష్ణవ శ్రీరామనవమి



అప్పన్న ఉత్సవమూర్తులకు అభిషేకం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం వైష్ణవ శ్రీరామనవమిని ఘనంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలతో పాటు ఆళ్వారులను ఆలయ ఆస్థాన మండపంలో అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం అనంతరం పంచకలశ స్నపనం విశేషంగా నిర్వహించా రు. ఆలయ ప్రధానార్చకుడు ఇరగవరపు రమణాచార్యులు, పురోహిత్ అలంకారి కరి సీతారామాచార్యులు, అర్చకుడు చక్రపాణి తదితరులు పూజలు చేశారు.

సందడిగా గ్రాడ్యుయేషన్ డే



పట్టాలు తీసుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

సింహాచలం: పెందుర్తి శ్రీ చైతన్య పాఠశాలలో శనివారం ప్రైమరీ విద్యార్థులకు గ్రాడ్యుయేషన్‌ను ఘనంగా నిర్వహించారు. ఐదోతరగతి పూర్తి చేసుకుని ఆరో తరగతిలోకి ప్రవేశిస్తున్న విద్యార్థులకు ప్రిన్సిపాల్ పి.తారకేశ్వరరావు పట్టాలు అందజేశారు. కార్యక్రమంలో ఉత్తరాంధ్ర పాఠశాలల ఏజీఎం సురేష్, పాఠశాల రీజినల్ ఇన్‌చార్జి మహ్మద్ అలీ, ప్రైమరీ జోనల్ ఇన్‌చార్జిలు శైలజ, రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

వేలం ద్వారా రూ.14.81లక్షల ఆదాయం

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి దేవస్థానంలో పలు వ్యాపారాలు నెల రోజుల పాటు నిర్వహించుకునేందుకు శనివారం వేలం పాటలు నిర్వహించారు. దీని ద్వారా దేవస్థానానికి 14లక్షల 81వేల 400రూపాయల ఆదాయం లభించింది. సింహగిరిపై భక్తులు సమర్పించే కొబ్బరి చెక్కలు తీసుకోవడానికి రూ. 3.61లక్షలకు, కొండదిగువ భైరవగేటు వద్ద కొబ్బరి చెక్కలు తీసుకోవడానికి రూ.4.30లక్షలకు వేలం ఖరారైంది. అలాగే కొండపైన సెల్‌ఫోన్లు, కెమెరాలు భద్రపరిచే స్టాల్ రూ. 3.21లక్షలకు, ఐస్‌క్రీమ్‌ల విక్రయానికి రూ.1.78లక్షలకు గురువారం సంతలో ఆశీలు వసూలుకు రూ.10వేలు, గోపాలపట్నం పెట్రోల్ బంక్ వద్ద దేవస్థానం స్థలంలో బుధవారం సంతలో ఆశీలు వసూలు పాట రూ. 11వేలకు, బుధవారం మినహా ఇతర రోజుల్లో ఆశీలు వసూలకు రూ. 11,300 పాటదారులు దక్కించుకున్నారు. అలాగే వరాహ పుష్కరిణి వద్ద కొబ్బరికాయలు విక్రయించుకోవడానికి రూ.60,500, పైడితల్లి, బంగారమ్మ ఆలయాల వద్ద కొబ్బరి చెక్కలు, చీరులు తీసుకునేందుకు రూ.9900కు వెళ్లింది. దేవస్థానం ఏఈవోలు శ్రీనివాసరావు, ఆనంద్‌కుమార్, సూపరింటెండెంట్ పిల్లా శ్రీనివాసరావు, సిబ్బంది దొంతల రమణ తదితరులు వేలం పాటలు నిర్వహించారు.

బీసీలను గుర్తించింది జగనే

- జీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు కృష్ణయ్య

ఎంవీపీకాలనీ : బీసీలకు సముచిత స్థానం కల్పించింది సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య పేర్కొన్నారు. అనకాపల్లి వేదికగా బీసీ గర్జన సభలో పాల్గొనేందుకు కృష్ణయ్య విశాఖ వచ్చారు. ఎయిర్ పోర్టులో నగర బీసీ నాయకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయంగా, సామాజికంగా వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో బీసీలకు గౌరవం దక్కుతోందన్నారు. వివిధ అంశాలపై నగర బీసీ నాయకులతో కృష్ణయ్య చర్చించారు. కార్యక్రమంలో జాతీయ బీసీ సంఘం రాష్ట్ర ఇన్‌చార్జ్ బోను దుర్గా నరేష్, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పిల్లా నివాస్, రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్, బీసీ యువసేన రాష్ట్ర అధ్యక్షుడు అనచంద్ర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సురేష్ ప్రమాణస్వీకారోత్సవం



మాట్లాడుతున్న నాయకులు

పరవాడ: వైఎస్సార్‌సీపీ జిల్లా యువజన అధ్యక్షుడిగా నియమితులైన సబ్బవరం మండలం ఆరిపాకకు చెందిన పాలిశెట్టి సురేష్ ప్రమాణ స్వీకారోత్సవం ఆదివారం సాయంత్రం 4 గంటలకు సబ్బవరం దరి జోడుగుళ్ల కూడలిలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్లు మండల పార్టీ యూత్ అధ్యక్షుడు పెదిశెట్టి శేఖర్ చెప్పారు. శనివారం పరవాడ పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. భారీ బహిరంగ సభకు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు బైరెడ్డి సిద్ధార్థరెడ్డి, రాష్ట్ర మంత్రులు బూడి ముత్యాలనాయుడు, గుడివాడ అమర్‌నాథ్, అనకాపల్లి ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, పెందుర్తి శాసన సభ్యుడు అన్నంరెడ్డి అదీప్‌రాజ్, ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మి శ్రీనివాసరావు, జెడ్పీటీసీ పైల సన్యాసిరాజు పాల్గొంటున్నారని చెప్పారు. బహిరంగ సభకు మండలంలో ముఖ్య నాయకులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని సభను జయప్రదం చేయాలని ఆయన కోరారు. సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు కోన రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు పాల్గొన్నారు.

కన్వెన్షన్ పనులు పూర్తి చేయాలని వినతి



కలెక్టర్ మల్లికార్జునకు వినతిపత్రం అందజేస్తున్న 95 కార్పొరేటర్ ముమ్మన దేముడు

సింహాచలం: జీవీఎంసీ 95వవార్డు చీమలాపల్లిలోని కన్వెన్షన్ సెంటర్ పనులను పూర్తి చేయాలని కలెక్టర్ మల్లికార్జునను శనివారం 95వార్డు కార్పొరేటర్ ముమ్మన దేముడు కోరారు. కలెక్టర్ కార్యాలయంలో మల్లికార్జునను కలిసి వినతిపత్రం అందజేశారు. చీమలాపల్లిలో కన్వెన్షన్ సెంటర్ పనులకు రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి నిధులు రూ.2 కోట్లు మంజూరయ్యాయని, ఆ నిధులతో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కోరారు. అలాగే చినముషిడివాడలో వీఎంఆర్‌డీఏ నిధులు రూ.5 కోట్లతో నిర్మించిన కల్యాణ మండపాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించారని..దీన్ని ఆప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కలెక్టర్ సానుకూలంగా స్పందించి చీమలాపల్లిలోని కన్వెన్షన్ సెంటర్ పనులు పూర్తి చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారని ముమ్మన పేర్కొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోండి

- ఎంపీడీవో హేమసుందర్రావు

పరవాడ: ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ఎస్సీ, ఎస్టీ వర్గాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో వి.హేమసుందర్రావు పిలుపునిచ్చారు. భర్నికం ఎస్సీ కాలనీలో శనివారం నిర్వహించిన పౌర హక్కుల దినోత్సవ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. భారత రాజ్యాంగంలో పౌరుడి హక్కులు.. వాటి ప్రాధాన్యతను వివరించారు. కులాంతర వివాహాలకు సంబంధించి ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సహకాలను వివరించారు. గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజలకు అందజేస్తున్న ప్రభుత్వ సేవలపై అవగాహన కల్పించారు. జగనన్న విద్యా దీవెన, వసతి దీవెన, విదేశీ విద్యా విధానం గురించి వివరించారు. గ్రామంలో విద్యుత్, తాగునీరు, రహదారుల వంటి సమస్యలను ప్రజలను అడిగి తెలుసుకున్నారు. జగనన్న కాలనీలు, విద్య, వైద్య, ఆరోగ్య సదుపాయాల్లో వివక్షతపై ఆరా తీశారు. కార్యక్రమంలో పరవాడ తహసీల్దారు వి.ప్రకాశరావు, ఎంఈవో సునీత, సీఐ పి.ఈశ్వరరావు, సర్పంచ్ పెదిశెట్టి పూజాశేఖర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అట్టహాసంగా ధ్వజారోహణం



ధ్వజారోహణం నిర్వహిస్తున్న అర్చకుడు రామానుజమ్



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: పెందుర్తి వెంకటాద్రిపై నిర్వహిస్తున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండోరోజు శనివారం ధ్వజారోహణం కార్యక్రమాన్ని అట్టహాసంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు సకల దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు ధ్వజస్తంభం వద్ద గరుడాళ్వార్ చిత్రపటాన్ని ఎగురవేశారు. అలాగే సాయంత్రం వేంకటేశ్వరస్వామికి లక్ష తులసితో విశేషంగా అర్చన చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. అర్చకుడు రామానుజమ్ ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. దేవస్థానం ఈవో సీలిమ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖ



సీపీ త్రివిక్రమ్‌వర్మకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న గొండు సీతారాం

దొండపర్తి: అందరి సహకారంతో బాలల హక్కుల పరిరక్షక నగరంగా విశాఖను తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్‌వర్మ తెలిపారు. ఏపీ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శనివారం సీపీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నగరంలో బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన, పోక్సో కేసులు, బాలల అక్రమ రవాణా, విద్యా సంస్థల పరిసరాల్లో మత్తు పదార్థాల సరఫరా వంటి అంశాలపై చర్చించారు. అనంతరం సీపీ మాట్లాడుతూ పోలీస్ అధికారులు, సిబ్బందితో పాటు వార్డు మహిళా సంరక్షణ కార్యదర్శులకు బాలల హక్కులు, చట్టాలపై సమగ్ర శిక్షణ ఇస్తామన్నారు. బాల్యవివాహాలపై ఎఫ్ఐఆర్, పిల్లలతో యాచక వృత్తి చేయిస్తున్న వారిపై కేసులు నమోదు చేయాలని సీతారాం సీపీ కలిసిన వారిలో లవకుశ ఉన్నారు.

ముగిసిన ఇండస్ట్రియల్ ఎక్స్‌పో

అక్కిరెడ్డిపాలెం(గాజువాక): ఆటోనగర్ డీ బ్లాక్‌లోని గోపాల్ ఇంజినీరింగ్, సరిపల్లి గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ఇండస్ట్రియల్ కం బిజినెస్ ఎక్స్‌పో-2023 శనివారం సాయంత్రంతో ముగిసింది. ఫ్లవరిష్ క్రియేషన్ యజమాని డి.వినోద్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు నిర్వహించిన ఎక్స్‌పోలో పలు పారిశ్రామిక ఉత్పత్తులతో పాటు ఫుడ్, మిల్లెట్స్ తదితర స్టాళ్లు కొలువుదీరాయి. ఎక్స్‌పోలో మూడో రోజు వివిధ అంశాలపై శిక్షణ కార్యక్రమాలు నిర్వహించారు. ముగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఐలా చైర్మన్ కె.సత్యానారాయణ రెడ్డి మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంతంలో ఇలాంటి ఎక్స్‌పో నిర్వహించిన వినోద్‌ను అభినందించారు. అనంతరం వినోద్ దంపతులు పారిశ్రామిక వేత్తలను సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. కార్యక్రమంలో మిమిక్రీ, ఆర్కెస్ట్రా, మ్యాజిక్ షో అలరించాయి. కార్యక్రమంలో ఐలా మాజీ చైర్మన్లు వై.సాంబశివరావు, శేషగిరిరావు, ఐలా కార్యదర్శి చీకటి సత్యనారాయణ, వాసీవా కోశాధికారి బి.ఎస్.రావు, సీనియర్ పారిశ్రామిక వేత్తలు శివయ్య, రాంబాబు తదితరులు పాల్గొన్నారు. పలు కళాశాలల నుంచి అధికసంఖ్యలో వచ్చిన విద్యార్థులు ఎక్స్‌పోను సందర్శించారు.